క్లుప్తంగా

నేడు వేసవి శిక్షణ శిబిరం ముగింపు

యడ్లపాడు: నెలరోజులు పాటు నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణ శిబిరం మంగళవారంతో ముగుస్తుందని బాసట సామాజిక, సాంస్కృతి వేదిక సంస్థ ప్రతినిధులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, డీఐఈవో ఎస్ఎం సుభాని, ఎంఈవోలు ఎంవీ నాగరత్నం, ఎం.అరుణకుమారి, ఎస్ఐ టి.శివరామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ముగింపు సభలో శిక్షణ పూర్తి చేసుకుని వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, అలాగే బాసట సంస్థ స్కాలర్‌షిప్ టెస్టులో ప్రతిభను చూపిన పదోతరగతి విద్యార్థులు ఐదుగురికి రూ.1.20 లక్షల ఉపకార వేతనాల చెక్కులు అందజేయనున్నట్లు తెలిపారు. శిబిరంలో స్వచ్ఛందంగా సేవలు అందించిన ఉపాధ్యాయులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులకు అభినందించనున్నట్లు వివరించారు. దాతలు, అధికారులు, స్థానిక పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరవుతారని బాసట విద్యావిభాగం కన్వీనర్ కల్లూరి శ్రీనివాస్ (వాసు), అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు, కార్యదర్శి సామినేని వెంకటేశ్వర్లు (శ్రీను), కోశాధికారి కేతా రామబ్రహ్మం వెల్లడించారు.

బీమా సౌకర్యాలు సద్వినియోగం చేసుకోండి

గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ



శావల్యాపురం: అర్హత కల్గియున్న బ్యాంకు ఖాతాదారులు బీమా సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు) మేనేజరు వలేటి శివకృష్ణ అన్నారు. సోమవారం శావల్యాపురం బ్రాంచ్ శాఖ పరిధిలో బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన గత ఏడాది ఆరుమళ్ళ లక్ష్మయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ క్రమంలో సదరు ఖాతాదారుడుకు బ్యాంకులో ప్రమాద బీమా యోజన పథకాన్ని సభ్యత్వం నమోదు చేసుకోవటం వలన శ్రీరామ జనరల్ ఇన్సూరెన్సు సంస్థ ద్వారా రూ. 2 లక్షల రూపాయలు చెక్కును నామిని ఆరుమళ్ళ సామ్రాజ్యంకు బ్రాంచ్ మేనేజరు శివకృష్ణకు అందజేశారు. బ్యాంకులో ఖాతా ఉన్న వారందరు ప్రమాదవశాత్తు మృతి చెందితే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బాధిత కుటుంబ సభ్యులు బ్యాంకు అధికారులను సంప్రదించాలన్నారు. శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్సు ప్రతినిధి యం.కోటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ అరున్‌నెహ్రూ, దిలీప్‌కుమార్, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో సోమవారం పలు రేషన్ షాపుల్లో తహసీల్దార్ ఏవీ రమణ తనిఖీలు చేశారు. వీఆర్వో వెంకటరమణతో కలిసి రేషన్ షాపుల్లో నిల్వలు పరిశీలించారు. రిజిష్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎండీఎం వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిందని వచ్చే నెల 1వ తేదీ నుండి రేషన్‌కార్డుదారులు రేషన్‌షాపుకు వచ్చి సరుకులు తీసుకోవాలన్నారు. బియ్యాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని, డీలర్లకు అమ్ముకోవద్దని హెచ్చరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన జంపని వీరవసంతరావు రూ.51,116లు విరాళంగా అందించారు. ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజల అనంతరం నగదును ఆలయ కమిటీ అధ్యక్షుడు వజ్జా వీరాంజనేయులుకు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, రామారావు, సీతయ్య, నర్రా శ్రీనివాసరావు, వెంకట సుబ్బారావు, గొర్రె సాంబశివరావు ఉన్నారు.

రేపటి నుంచి సీపీఎం జిల్లా శిక్షణ తరగతులు

క్రోసూరు: ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజులపాటు క్రోసూరులో జరగనున్న సీపీఎం పల్నాడు జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రవిబాబు కోరారు. సోమవారం ఆమంచి భవన్‌లో జరిగిన సమావేశంలో రవిబాబు మాట్లాడుతూ 28, 29, 30 తేదీల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్) జిల్లా స్థాయి శిక్షణ తరగతులు క్రోసూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన కార్యకర్తలు వస్తారన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏ విధమైన ఆందోళనలు, పోరాటాలు చేయాలనే దానిపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, నాయకులు గొర్నెపూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


అధ్వానంగా గోదాములు



మండలంలోని కొత్తలూరు, పోట్లూరు, మతుకుమల్లి గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోదాములు అధ్వానంగా మారాయి. రైతులు పండించిన పంటలు గిట్టుబాటు ధర లేని సమయంలో నిల్వ ఉంచేందుకు లక్షల వ్యయంతో నిర్మించిన గోదాములు నిరుపయోగంగా మారాయి. దీంతో గోదాములు పరిసర ప్రాంతాల్లో పిచ్చిచెట్లు మొలిచి చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. కేవలం ప్రారంభోత్సవానికి పరిమితం మినహా నేటి వరకు గోదాములు నిర్వహణపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో గోదాములు అధ్వానంగా మారాయని రైతులు వాపోతున్నారు.

–శావల్యాపురం

ఎప్పుడైనా కూలవచ్చు!



మండలంలోని కనమర్లపూడి గ్రామం బీసీ కాలనీలో గ్రామస్తులు కోసం ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఓవర్‌హెడ్ పనిచేయక పోవటం చేత అలంకార ప్రాయంగా ఉంది. కాలనీలో చుట్టుపక్కల నివాస గృహాల వారు అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు కాలనీలో యువకులు ఆడుకుంటారు. ఏ క్షణంలో కూలిపోతుందని ప్రమాదం పొంచియుందని కాలనీవాసులు తీవ్రస్థాయిలో ఆందోళన చెందుతున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టి 25 సంవత్సరాలు అవుతోంది. పిల్లర్స్ కూడా పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. నిరుపయోగంగా ఉండటం చేత పిచ్చిచెట్లు మొలిచాయి. పలుమార్లు అధికారులు ప్రజాప్రతినిధులకు తెలిపినా ఫలితం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

–శావల్యాపురం

చీకట్లో ఐదు గ్రామాలు

మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్



సుబ్బయ్యపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పిడుగు పడి మరమ్మతులకు గురైన పీటీఆర్

రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలకు గత రెండు వారాలుగా విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయం వల్ల చీకట్లో మగ్గిపోతున్నాయి. మండలంలోని సుబ్బయ్యపాలెం, అలవాల, అచ్చయ్యపాలెం, తురిమెళ్ల, చిట్టుపోతులవారిపాలెం గ్రామాలకు సుబ్బయ్యపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ నుండి పవర్ సరఫరా అవుతుంది. అయితే ఈ నెల మొదటి వారంలో వీచిన గాలులకు, వర్షానికి సబ్‌స్టేషన్‌లో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్) మరమ్మతులకు గురైంది. పీటీఆర్‌పై వర్షంలో పిడుగు పడి ఫెయిల్ అయ్యిందని ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. అయితే ఈ ఐదు గ్రామాలకు బుచ్చిబాపన్నపాలెం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పవర్ సరఫరా ఇస్తున్నారు. గోగులపాడు గుండా ఈ గ్రామాలకు పవర్ సరఫరా అవుతుంది. పగలు, రాత్రి 8 గంటల వరకు సరిగా పవర్ సరఫరా అవుతుండగా, పవర్ లోడ్ పెరిగిన వెంటనే లైన్లు ట్రిప్ అయి పవర్ నిలిచి పోతోంది. తిరిగి మరో నాడు లైన్ మరమ్మతులు నిర్వహించి ఉదయం 11 గంటలకు పవర్ సరఫరా చేస్తున్నారు. నిత్యం ఈ తంతు కొనసాగుతోంది. ప్రస్తుతం నెల కొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రాత్రి వేళ చిమ్మచీకటిలో దోమల బెడదతో పై గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చంటి పిల్లలు ఉన్న కుటుంబాల పరిస్థితి ఎలా ఉంటుందో మనమే అర్థం చేసుకోవచ్చు. ఐదు గ్రామాల ప్రజలు పడుతున్న విద్యుత్ సరఫరా ఇబ్బందులను ఆ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి వెంటనే పీటీఆర్‌కు మరమ్మతులు నిర్వహించి నిత్యం విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

పీటీఆర్ పనిచేయడం లేదు

గత కొన్ని రోజులుగా సుబ్బయ్యపాలెం సబ్‌స్టేషన్‌లో పీటీఆర్ మరమ్మతులకు గురయింది. అయితే ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు తెలియజేశాం. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ రాగానే సబ్‌స్టేషన్ నుంచి ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తాం. అప్పటి వరకు బుచ్చిబాపన్నపాలెం సబ్‌స్టేషన్ నుంచి పవర్ సరఫరా అవుతుందన్నారు.

–రాంబాబు, ఏఈ

డీ అడిక్షన్ సెంటర్‌కు స్థలం ఎంపిక

ప్రభుత్వ హాస్పిటల్‌లో పరిశీలించి నిర్ధారించిన అధికారులు



హాస్పిటల్‌లో పర్యటిస్తున్న డాక్టర్ ప్రసూన, డాక్టర్ లక్కిరెడ్డి

నరసరావుపేట: కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో మత్తు వ్యవసన విముక్తి కేంద్రం (డీడీసీఏ) ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సోమవారం పరిశీలించి ఎంపిక చేశారు. జిల్లా ఆసుపత్రుల సమాన్వయ అధికారి డాక్టర్ ప్రసూన, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి హాస్పిటల్ సూపరింటెంట్‌తో డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్‌తో డీఅడిక్షన్ సెంటర్ స్థాపన కోసం అన్ని ప్రమాణాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న అనుకూలమైన స్థలం రెండవ అంతస్తులో గుర్తించి నిర్ధారించారు. మత్తు వ్యసన సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు సమగ్ర వైద్యసేవలు అందించేందుకు త్వరలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం, సమీప ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడానికి కీలకంగా ఉంటుందన్నారు.

5 లోగా ఆధార్ అనుసంధానం చేసుకోండి

నరసరావుపేటటౌన్: సంక్షేమ పథకాల బదిలీ కోసం బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి తెలిపారు. సోమవారం పోస్టల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకేజ్ చేయుటం తప్పనిసరి అని అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సిబ్బందిని సూచించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు నేరుగా బ్యాంక్ ఖాతాకు జమ చేయుటకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో సుమారు 51 లక్షల మందికి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ లేని కారణంగా సంవత్సరంలో జీఎస్‌డబ్ల్యూఎస్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొంత పురోగతి సాధించారన్నారు. అయినప్పటికీ లబ్దిదారుల్లో చాలా మందికి ఆధార్ అనుసంధానం కాలేదు అన్నారు. ఈ క్రమంలో తపాలా శాఖ, సచివాలయ యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీ లోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ప్రారంభం చేస్తామన్నారు. తద్వారా సంక్షేమ పథకాలు ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రేషన్ కార్డుల కోసం 696 అర్జీలు

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో నూతనంగా రేషన్ కార్డులు దరఖాస్తులు 696 వచ్చినట్లు తహసీల్దారు యం.అర్జున్ నాయక్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల ఆన్‌లైన్ అర్జీలు ఈకేవైసీ నమోదు అనంతరం సంబంధిత గ్రామ వీఆర్వో లాగిన్ అర్జీదారుడు అర్హత ఉన్నట్లు ధ్రువీకరణ చేసినటువంటి అర్జీలు 196 ఆమోదించామన్నారు. మండలంలోని కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులు 80 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. భూములు కొలతలు పూర్తి చేసి 3200 మంది రైతులకు ఫాం-9 నోటీసులు అందజేశామన్నారు. భూములకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్న రైతులు సమగ్ర ఆధారాలతో లిఖిత పూర్వకంగా తహసీల్దారు కార్యాలయంలో అందజేస్తే సత్వరమే క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కళాపరిషత్‌ల కృషి ఎనలేనిది



కళాకారులను సన్మానిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు, న్యాయవాది శ్రీనివాసరావు



కళా ప్రదర్శనల నాటికలో ఓ భాగం

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయ నాటికల పోటీలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే సోదరుడు డాక్టర్ సీహెచ్ ఫణీంద్రబాబు, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు హాజరై కళాకారులు సూరయ్య, వంకాయలపాటి చెన్నకేశవ, సుబ్బారావులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక, పౌరాణిక నాటకాలకు పూర్వ వైభవం దక్కేలా కళాపరిషత్‌లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కళాకారులకు జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించారు.


ఆకట్టుకున్న నాటికలు...

బాపట్ల సహృదయ ద్రోణాదుల ఆధ్వర్యంలో 'వర్క్‌ఫ్రం హోమ్' నాటికకు రచయితగా అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకుడిగా మహేంద్ర వ్యవహరించారు. సాతులూరు వజ్జా రామనాథం ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'రారాజు సుయోధన' పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. దర్శకత్వం వజ్జా మధుసూదనరావు వ్యవహరించారు. వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'ఏకాకి' నాటికకు రచయితగా నాగేశ్వరరావు, దర్శకుడిగా ఖాజీపేట తిరుమలయ్య వ్యవహరించారు.

నేటి ప్రదర్శనలు...

హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'అమ్మ చెక్కిన బొమ్మ', న్యూఢిల్లీ వారి 'అనశ్వరం', చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'మా ఇంట్లో మహాభారతం' నాటిక ప్రదర్శనలు జరగనున్నట్లు నిర్వాహకులు, కళాపరిషత్ సభ్యులు తెలిపారు.

1న సినిమా పాటల పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

మాచర్ల: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో జూన్ 1న సినిమా పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలసుబ్రహ్మణ్యం కళా పరిషత్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం పట్టణంలోని సవే రా లాడ్జి బజారులో ఉన్న మెడికల్ అసోసియేషన్ భవనంలో ఆయన మాట్లాడారు. 1న ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయన్నారు. 25 మంది గాయనీ గాయకులను ముగ్గురు న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎంపికైన గాయనీ గాయకులతో అదే రోజు సాయంత్రం 7 గంటలకు పోటీలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమానికి మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 10వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు, నాలుగో బహుమతి రూ.4 వేలు, 5వ బహుమతి రూ.3వేలతో పాటు ఎంపికైన మరో 20 మంది గాయనీ గాయకులకు రూ. వెయ్యి చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని వెల్లడించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్ ఖాన్, ఉపాధ్యక్షుడు బాహాటం శేషగిరి రాజు, సహాయ కార్యదర్శి పులుసు శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు పాల్గొన్నారు. వివరాలకు 9505453457, 9573786029, 9866537346 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

డొంకమార్గం కోసం.. సొంతభూమికి కోసం

యడ్లపాడు గ్రీవెన్స్‌లో సర్వేకోసం రెండు వినతులు



కండ్రిక సర్వే వినతిని స్వీకరిస్తున్న తహసీల్దార్ జెట్టి విజయశ్రీ

యడ్లపాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం మండల ప్రజల నుంచి రెండు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ సోమవారం తెలిపారు. స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి విశ్వనాథుని కండిక వరకు సమగ్ర సర్వే నిర్వహించి డొంకమార్గం హద్దుల్ని నిర్ధారించాలని జాలాది నీటిసంఘం అధ్యక్షుడు పోపూరి రాఘవయ్య, మాజీ పంచాయతీ ఉపసర్పంచ్ ముత్తవరపు సుబ్బారావు అందించారు. ఇదే విషయంపై యడ్లపాడు గ్రామ పంచాయతీలోనూ ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీన జరిగిన సాధారణ సమావేశంలో పంచాయతీ సర్పంచ్ కారుచోల హేమ అధ్యక్షతన 9 సభ్యులతో తీర్మానించిన ప్రతితో పాటు వినతిని తహసీల్దార్‌కు అందించినట్లు వారు తెలిపారు. అలాగే తన పట్టాభూమిలో కొలతలు తగ్గాయని, వాటికి సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలని కోరుతూ ఉన్నవ గ్రామానికి చెందిన గోగినేని శ్రీనివాసరావు తహసీల్దార్‌కు వినతి సమర్పించాడు. సర్వేకు సంబంధించిన ఈరెండు వినతుల్ని త్వరలోనే పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని విజయశ్రీ తెలిపారు.

మహేంద్ర రాష్ట్ర సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



నూతనంగా ఎంపికైన జొరిగె మస్తాన్‌రావు, సభ్యులను అభినందిస్తున్న సంఘం సభ్యులు

వినుకొండ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహేంద్ర (మేదరి) సంఘం నూతన ప్రమాణస్వీకార మహోత్సవం పట్టణంలోని గంగినేని కల్యాణ మండపంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా జొరిగె మస్తాన్‌రావు, ప్రధానకార్యదర్శి పోలేపల్లి నాగేంద్ర, కోశాధికారిగా సిరిగి మంగారావు, ప్రచార కార్యదర్శిగా పిల్లి మాణిక్యాలరావు ప్రమాణస్వీకారం చేశబూరారు. అదేవిధంగా అనుబంధ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మేదరి సంఘాల ముఖ్య నాయకులు పాల్గొని నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా జొరిగె మస్తాన్‌రావు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో మా యొక్క కులం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మినహాయించి ఎస్సీ, ఎస్టీల్లో ఉన్నది, కావున ప్రస్తుత ప్రభుత్వం మమ్మల్ని ఎస్టీల్లో చేర్చవలసిందిగా డిమాండ్ చేశారు. మా సొసైటీలను మరలా ఏర్పాటు చేయాలని, వెదురు తో తయారు చేసే వస్తువులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. మా కులాన్ని ఎస్టీలో చేర్చి సబ్సిడీపై మాకు వెదురు సప్లయ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఏల్లాలుబాబు, డి.ఏసుబాబు, ఎన్.హనుమాన్ ప్రసాద్, జొరిగె శ్రీనివాసరావు, కె. వెంకట్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవరసభరితంగా సంగీత నాట్య పోటీలు

- ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు
- మూడోరోజు కొనసాగిన కళానిలయం జాతీయస్థాయి సంగీత నాట్యపోటీలు



ఆర్ దివ్యనందిని



పూర్వవేదాంత్



మిట్ట రితీక్ష



దివ్యవర్మ

చిలకలూరిపేట: పురివిప్పిన నెమలిని తలపించే నృత్యాలు.. మనసును పులకింపచేసే కీర్తనలు.. సుమధుర గీతాలు... ఉర్రూతలూగించే జానపద నృత్యాల నడుమ కళానిలయం 40వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలు సోమవారం మూడో రోజు కొనసాగాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొనసాగుతున్న ఈ పోటీలలో చివరిరోజు వివిధ అంశాలలో కళాకారులు ఉత్సాహంగా పాల్గొని కళారూపాలను ప్రదర్శించారు. మూడో రోజు పోటీలను కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణీ శివ సత్యనారాయణమ్మ నటరాజపూజ చేసి ప్రారంభించారు. సూర్య, చంద్ర విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో జానపద నృత్యాలతో పాటు శాస్త్రీయ బృందనాట్యాలు, శాస్త్రీయ జంటనాట్యాలు, శాస్త్రీయం కాని జంటనాట్యాలు, శాస్త్రీయ కాని బృందనాట్యాలు, శాస్త్రీయ నృత్య నాటికలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తుమ్మెదలున్నాయేమిరా, చిరుత ముత్తి, పారేగోదావరి, నా పేరు మల్లిగాడు, పోమతి పొన్నమ్మ, ఓరి మగడా, మొక్కజొన్న చేనులో వంటి జానపద నృత్యాలతో పాటు, శ్రీకృష్ణ తరంగిణి, సారూప్యం, దేవిస్తుతి, కాళింగనర్తనం, శ్రీకృష్ణలీలలు, గోవర్ధనం వంటి బృందనాట్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా జానపద నృత్యాలు రసజ్ఞులైన ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఈ సందర్భంగా నాట్యాచార్యులకు సన్మానాలు నిర్వహించారు. ప్రేక్షకులు ఆసక్తిగా ప్రదర్శనలను వీక్షించారు.

కేంద్ర పథకాలను రైతులకు తెలియచేయండి

కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి



మాట్లాడుతున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలోని రైతులకు కేంద్రం ద్వారా అందుతున్న ప్రయోజనాలను విరివిగా ప్రచారం చేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి పేర్కొన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై చర్చించారు. కుమారస్వామి మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీజేపీ మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకుని వెళ్లాలని, రైతులకి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ, రైతు భరోసా విధానాన్ని గ్రామానికి ఐదుగురు ఒక టీంలాగా ఏర్పాటై రైతులకి జరుగుతున్న మేలు గురించి తెలియజేయాలని కోరారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం పొగాకు ఏ విధంగా కొనుగోలు చేస్తుందో, వారికి ఏ విధంగా గిట్టుబాటు ధర ఇవ్వాలనే ఆలోచన చేస్తుందో రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి హరిచంద్రరెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరు శశికుమార్, జిల్లా ఇన్‌చార్జి కుక్కర శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కామినేని హనుమంతరావు, కేతనబోయిన హనుమంతరావు, విజయకుమార్, అంజిరాజు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో న్యాయవాదుల విధులు బహిష్కరణ

సత్తెనపల్లి: న్యాయవాది కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఆ దాడిలో కొమ్మిశెట్టి సెల్‌ఫోన్‌ను ఆయనపై దాడి చేసిన వారు తీసుకెళ్లారని దానిని పోలీసు అధికారులకు బార్ అసోసియేషన్ ద్వారా తెలియజేసి ముందుగా ఆ సెల్‌ఫోన్ ఇప్పించాలని, కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై పెట్టిన కేసును, కౌంటర్ కేసును పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ కార్యవర్గం సంబంధిత అధికారులను కలిసి రిప్రజెంటేషన్ ఇవ్వాలని, ఇక నుంచి న్యాయవాది కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుకు తగిన భద్రత కల్పించాలని సంబంధిత అధికారులను బార్ అసోసియేషన్ ద్వారా కోరాలని బార్ అసోసియేషన్ తీర్మానం చేసింది. సమావేశంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

పట్టణ ఎంఎస్‌ఎఫ్‌కు నూతన కార్యవర్గం



నియామక పత్రాలను అందజేస్తున్న అద్దంకి బాబు, కోటేశ్వరరావు మాదిగలు

నరసరావుపేట: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం టౌన్ హాలులో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమెఎస్ఎఫ్) పట్టణ నూతన కమిటీని పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అద్దంకిబాబు మాదిగ, ఎంఎస్పీ అధ్యక్షులు కనుమూరి కోటేశ్వరావు మాదిగ సమక్షంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా కలపాల చరణ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా బుట్టి మహేంద్ర మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కాపా డానియల్ మాదిగ, కోశాధికారిగా కందుల రాజు మాదిగ, కార్యదర్శిగా పల్లపు శ్యామ్ మాదిగలను ఎన్నుకున్నారు. నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చిరుగూరి నాగరాజు మాదిగ, మల్లవర బాబు మాదిగ పాల్గొన్నారు.